క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ



ఆశ్రమానికి సరకులు అందిస్తున్న ఖాన్

ఏయూ క్యాంపస్: లాసన్స్‌బే కాలనీలోని కేఆర్ఆర్ వృద్ధాశ్రమానికి గురుస్థానం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంస్థ డైరెక్టర్ ఎస్.ఖాన్ నిత్యావసర సరకులు అందజేశారు. తన తండ్రి జయంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమానికి గురువారం ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు రాలు రూప, సిబ్బంది, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.నిషా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ముప్పల లక్ష్మి

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరులో సీసీ రోడ్డు నిర్మాణం, కాలువల మరమ్మతుల పనులను కార్పొరేటర్ ముప్పల లక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.17 లక్షల వ్యయంతో తలపెట్టిన ఈ పనులను రెండు వారాల్లో పూర్తి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శిరీష, తిలక్, దిల్ రాజు, నరేష్, పద్మజ, సాయి. రాంప్రసాద్, పాలకొల్లు రాంబాబు, రజకవీధి పెద్దలు, అబ్బులు, ముప్పల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ఆరిలోవ కాలనీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో గురువారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ నుంచి ఆపరేషన్ కాలనీ మీదుగా పాండురంగాపురం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీత మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ఇళ్ల ముందు ఖాళీ సీసాలు, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతోనే ప్రగతి సాధ్యం



మాట్లాడుతున్న పవన సాయి సాహిత్య

బీచ్ రోడ్డు: ఉన్నత లక్ష్యంతోనే ప్రగతి సాధ్యమని 2022 సివిల్స్ ర్యాంకర్ కసిరాజు పవన సాయి సాహిత్య అన్నారు. సిరిపురంలోని తక్షశిల ఐఏఎస్ అకాడమీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సివిల్స్ సాధనకు పేదరికం అడ్డు కాదన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ప్రతి విద్యార్థి శ్రమించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు ఓర్పు, నేర్పు, సమయ పాలన, కష్టపడేతత్వం అలవాటు చేసుకోవాలన్నారు.

సినీ సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్: ఇళయరాజా 80వ జన్మదినోత్సవం, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతిని పురస్కరించుకుని శనివారం కళాభారతి ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈమేరకు పోస్టర్‌ను మేయర్ హరివెంకట కుమారి, యాక్సీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు.

వర్సిటీ.. హరిత శోభితం

- ఏయూలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకం
- సొంతంగా నర్సరీలో మొక్కలు వృద్ధి
- దీర్ఘకాలిక ప్రయోజనాలతో ముందడుగు



మొక్కలు పెంచే కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి



వర్సిటీలో పెంచుతున్న మొక్కలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని సుందరంగా, శోభాయమానంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. వర్సిటీ హార్టికల్చర్ విభాగంలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకాన్ని ఇటీవల ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి వర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమానికి అవసరమైన మొక్కల పెంపకానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు. నీడనిచ్చే చెట్లు, అందంగా అలంకరణకు ఉపకరించే మొక్కలు, పక్షులకు ఆశ్రయం ఇస్తూ, ఆహారాన్ని అందించే చెట్లను పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఔషధ, అలంకరణ, నీడనిచ్చే చెట్లు నాటడానికి అవసరమైన మొక్కలను విత్తనాల నుంచి అభివృద్ధి చేసే దిశగా పనులు ప్రారంభించారు. ఏయూ హార్టికల్చరల్, బ్యూటిఫికేషన్ విభాగం, వృక్షశాస్త్ర విభాగం సంయుక్తంగా వర్సిటీలో సొంతంగా చిన్నపాటి నర్సరీని అభివృద్ధి చేస్తున్నాయి. కొమ్మలు, వేర్లు, ఆకుల నుంచి కొత్త మొక్కలను అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. అదే విధంగా భారీ వృక్షాలుగా పెరిగే అడవి బాదం, బాదం వంటి విత్తనాలను సేకరించారు.

నాలుగు జాతుల పెంపకం

తొలి దశలో నాలుగు రకాల మొక్కలను పెంచుతున్నారు. ఔషధ మొక్కల విభాగంలో ఇన్సులిన్, వావిలి, అడ్డసరం, అశ్వగంధ, నిమ్మగడ్డి, పొడపత్రి, అశోక, అలంకరణ మొక్కల్లో టెంపుల్ ట్రీ, ఇక్సోరా, పామ్, బోగన్‌వీలియా, క్రోటన్ మొక్కలు, నీడనిచ్చే జాతుల్లో వేప, నేరేడు, బాదం, మామిడి జాతులను పెంచుతున్నారు. వీటితో పాటు నాసా సూచించిన గ్రహాల్లో సైతం ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలైన స్నేక్ ప్లాంట్, చైనీస్ పామ్, డ్రెసినీ, ఆరలీయ, మనీప్లాంట్ తదితర వాటిని కూడా వృద్ధి చేస్తున్నారు. బయట నుంచి కొనుగోలు చేయకుండా వర్సిటీలో సొంతంగా వీటిని వృద్ధి చేయడానికి ప్రత్యేకంగా హార్టికల్చరల్ విభాగంలో కొంత భాగం తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా మడుల రూపంలో మట్టిని సిద్ధం చేసి కొన్ని రకాల మొక్కల కొమ్మలను నాటి వాటి నుంచి కొత్తవి తయారు చేస్తున్నారు. అదే విధంగా మరికొన్ని జాతుల చెట్ల విత్తనాలను సేకరించి, కవర్లలో వీటి నుంచి మొక్కలను వృద్ధి చేసే చర్యలు ప్రారంభించారు. వచ్చే నెలలో వర్షాలు ఆరంభమయ్యే నాటికి విశ్వవిద్యాలయంలో ఎంపిక చేసిన ప్రాంతాలలో వీటిని నాటి, సంరక్షించే చర్యలు చేపడతారు. మొత్తమ్మీద ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని హరిత శోభితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు నడుం బిగించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సర్టిఫికెట్ కోర్సు

ఎంవీపీ కాలనీ: గాయత్రి విద్యా పరిషత్ కళాశాల ఆంగ్ల భాషా విభాగం ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. గురువారం ఎంవీపీ కాలనీలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ కోర్సును ప్రారంభించారు. గురువారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ అందించనున్నారు. ఇప్పటికే ఈ కోర్సు ద్వారా శిక్షణ కోసం 42 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు.

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రజని, డైరెక్టర్ డాక్టర్ ఆనంద్, కోర్సు కన్వీనర్ డాక్టర్ సాయిబాల, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్కాపురం: నైట్రోజన్ పైప్ తగిలిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన వై.సుశీల్ యాదవ్(35) పరవాడలోని ప్రోక్షన్ ప్రొడక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి నైట్రోజన్ తరలించే లారీలో పని చేస్తున్నాడు. దీనిలో భాగంగా సోమవారం సంస్థ వద్ద లోడ్ చేసిన నైట్రోజన్ లారీతో హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)కు వచ్చాడు. లారీలోని నైట్రోజన్‌ను అన్‌లోడ్ చేసేందుకు అవసరమైన పైప్‌ను హెచ్‌పీసీఎల్‌లో ఉన్న నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్ పైపునకు బిగించాడు. నైట్రోజన్ అన్‌లోడ్ అవుతుండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో పైపు వేగంగా వచ్చి సుశీల్‌ను బలంగా ఢీకొంది. గాయపడిన ఆయనను అంబులెన్స్‌లో నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుందరయ్యకాలనీలో అంధకారం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సుందరయ్య కాలనీలో అంధకారం నెలకొంది. నెలలు తరబడి వీధి దీపాలు వెలగకపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో ఇళ్ల నుంచి వీధుల్లోకి వచ్చిన వెలుగులు ఆధారంగా గడిపేస్తున్నారు. ఇక్కడ 8 వీధిల్లోనూ ఇదే సమస్య ఉంది. కాలనీలో 156/బీ-9-1 నంబరు గల విద్యుత్ స్తంభం నుంచి నాలుగైదు స్తంభాలకు ఒకటి చొప్పున లైట్లు వెలుగుతున్నాయి. సుమారు 20 దీపాలకు పైగా వెలగడంలేదు. దీంతో ఈ కాలనీలో అంధకారం నెలకొంది. ఈ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అవి గుంపులుగా దాడి చేస్తున్నాయి. ఇటీవల ఇక్కడ కోకోకోలా భవనం సమీపంలో కుక్క ఓ బాలుడిపై దాడిచేసి గాయపరిచింది. రాత్రి వేళ చీకటిలో బయటకు రావాలంటే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. సచివాలయం సిబ్బందికి, జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సుందరయ్య కాలనీలో వీధి దీపాలు వెలిగించాలని ప్రజలు కోరుతున్నారు.



అంధకారంగా ఉన్న సుందరయ్య కాలనీ

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. అధ్యాపకుడు సంతోష్ గురువారం వేదిక్ మ్యాథ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే గణితంలో పట్టు సాధించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతాయన్నారు. అధ్యాపకుడు శిరీష్ మాట్లాడుతూ తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. కథలు చదివించడం, చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు.



వేదిక్ మ్యాథ్స్‌పై శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు సంతోష్

సాగర్‌నగర్‌లో చోరీ

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి సాగర్‌నగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ద్వారకా జోన్ క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు తెలిపిన వివరాలు ప్రకారం.. సాగర్‌నగర్‌లో గుడ్లవానిపాలెం సమీప లేఅవుట్‌లో నివాసముంటున్న నూకరత్నం కుటుంబ సభ్యులతో 13 రోజుల క్రితం సాగర్‌నగర్‌లో వేరే కాలనీలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆమె గురువారం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో ఆమె బీరువాలో దాచిన డబ్బులు, బంగారు ఆభరణాలు వెతకగా కనిపించకపోవడంతో లబోదిబోమంటూ ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ద్వారకా జోన్ క్రైం సీఐ ఇమాన్యుయేల్‌రాజు, ఆరిలోవ క్రైం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం రూ 1.50 లక్షలు నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక జత వెండి పట్టీలు పోయినట్లు కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

ఆరిలోవ: అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విశాఖ వేలీ స్కూల్ సమీపం ప్రభుత్వ బాలికల గృహంలో గురువారం బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలలు మనో వికాసం పెంపొందించుకోవాలని సూచించారు. ఇందు కోసం పిల్లల తల్లిదండ్రులు, వసతి గృహాల్లో నిర్వాహకులు సహకరించాలన్నారు. మంచి ఆహారం తినడం, ఆటలాడడం వల్ల బాలల్లో మనోవికాసం కలుగుతుందన్నారు. బాలలు క్రమశిక్షణతో చదువుకుని దేశాభ్యున్నతికి ఉపయోగపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ ఎ.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



తులసీదళార్చనలో పాల్గొన్న భక్తులు

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలు

మర్రిపాలెం: వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఈ మేరకు ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. యలమంచిలి ప్రాంతానికి చెందిన కసింకోట భవాని, తన కుమారుడు శశిభూషణ్‌తో కలిసి బుధవారం(గత నెల 31న) కంచరపాలెం కప్పరాడలోని తన బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం కప్పరాడ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవాని, శశిబూషణ్‌తో కలిసి రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఏసర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శశిభూషణ్‌కు గాయాలయ్యాయి. తల్లి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ల పంపిణీపై మేయర్ ఆరా

ఆరిలోవ: పెదగదిలి దరి కొండవాలు ప్రాంతం సింహగిరి కాలనీలో 32వ నంబరు సచివాలయం పరిధిలోని వలంటీర్లు గురువారం ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ క్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వలంటీర్లు ప్రతి నెలా వచ్చి పింఛన్ సకాలంలో అందిస్తున్నారా? లేదా? అంటూ ఆరా తీశారు. పింఛన్ అందడంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని వలంటీర్లకు మేయర్ సూచించారు. అనంతరం పలువురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి మేయర్ స్వయంగా పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. అందుబాటులో యూపీహెచ్‌సీలు ఉన్నాయని, అనారోగ్యంతో బాధపడేవారు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వీటిలో వైద్య సేవలు పొందాలని ఆమె స్థానికులకు సూచించారు.



సింహగిరి కాలనీలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నివారణ

సీతంపేట: జీవీఎంసీ జోన్-3 పరిధి 25వ వార్డు రెల్లి వీధిలో గురువారం మలేరియా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా సీతంపేటలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించాయి. ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. కరోనా కష్టకాలంలో వైద్య, ఆరోగ్య, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది వెలకట్టలేని సేవలు అందించారని కొనియాడారు. మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా జీవీఎంసీ, మలేరియా సిబ్బందికి సహకరించాలని కోరారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

నీటి నిల్వలు ఉంచొద్దు..

జిల్లా మలేరియా అధికారి వై.మణి, బయాలజిస్ట్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ నెల నుంచి అక్టోబరు వరకు నగరంలో మలేరియా జ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, డీఎంవో డాక్టర్ రామిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తి చేసే ఎనాఫిలస్ దోమలు నిల్వ ఉన్న మంచినీటిలో పెరుగుతాయన్నారు. వాటి నియంత్రణకు గోళాలు, కుండీలు, వోవర్‌హెడ్ ట్యాంకులపై మూతలు పెట్టాలని సూచించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు, మలేరియా సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

శ్రీలంక దేశస్తురాలికి ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం పరిశోధకురాలు, శ్రీలంక దేశస్తురాలు ఎస్.డబ్ల్యూ నిమ్లాయ్ తక్షిలకి ఏయూ డాక్టరేట్ లభించింది. ఆచార్య కె.రమేష్‌బాబు పర్యవేక్షణలో 'మేనేజ్‌మెంట్ ఆఫ్ కార్డియోవస్కులర్ డిసీజ్ త్రూ యోగా అండ్ నేచరోపతి విత్ స్పెషల్ రిఫరెన్స్ టు చక్ర మెడిటేషన్'అంశంపై జరిపిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను తక్షిల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యోగా విభాగం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు. భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న తక్షిల

జీర్ణకోశ సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచించనున్నారు. తీవ్ర అనారోగ్య కలిగిన వారు తమ వైద్య పరీక్షలు రిపోర్టులను తీసుకురావాలని సూచించారు.

పీఆర్‌సీ ఎరియర్స్ విడుదలపై హర్షం

ఏయూ క్యాంపస్: పీఆర్‌సీ ఎరియర్స్ విడుదల చేస్తూ జీవో విడుదల చేయడంపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఏయూ విశ్రాంత ఆచార్యులు సంక్షేమ సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆచార్య బళ్ల అప్పారావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమౌళి, కార్యదర్శి జె.రామునాయుడు, సంయుక్త కార్యదర్శి బాబు హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆచార్యులు

రైతుబజార్ల అభివృద్ధికి కృషి

గోపాలపట్నం: నగరంలోని అన్ని రైతుబజార్ల అభివృద్ధికి క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్నామని రాష్ట్ర రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈవో) ముల్లంగి సందకిషోర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మర్రిపాలెం రైతుబజార్‌లో ఆయన పర్యటించి రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో రైతుబజార్ల ఈవో తెలిపిన సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ వైరింగ్, లైట్లు, రైతుబజార్ల వెనుక వైపు కాంపౌండ్ వాల్, బజారు ముఖద్వారం, మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, ఫ్లోరింగ్ మరమ్మతులు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతుబజార్‌లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు, వినియోగదారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య అధికారి షేక్ యాసిన్, డీఈ కెనడీ, మర్రిపాలెం రైతుబజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెం రైతుబజార్‌లో సమస్యలు పరిశీలిస్తున్న సీఈవో నందకిషోర్